క్లుప్తంగా

జోరుగా పాదయాత్ర



కోస్గి: మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర జోరుగా కొనసాగుతోంది. మంగళవారం మండల పరిధిలోని బిజ్జారం గ్రామంలో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భం నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పాలనలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ వార్ల విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం : కేసునమోదు

మద్దూరు: ఓ యువతి అదృశ్యమైన ఘటన కొత్తపల్లి మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్యాంసుందర్ కథనం మేరకు ఈ నెల 7న సదరు యువతి(19) తన మేనత్తతో కలిసి గ్రామ శివారులోని పొలానికి వెళ్లింది. సాయంత్రం పనులు ముగించుకొని ఇంటి వస్తున్న క్రమంలో ఆమె మేనత్త వడివడిగా నడవగా యువతి నెమ్మదిగా వచ్చింది. వెనుకకు తిరిగి చూసేసరికి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల దగ్గర, ఇతర గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

16న మౌఖిక పరీక్ష

మాగనూర్: తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ హైదరాబాద్ అందించే ఎకానమిక్ సపోర్ట్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 16న మౌఖిక పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తమ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

ఊట్కూరు: నిడుగుర్తి గ్రామంలో రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు పత్తి దగ్ధమైన ఘటనలో నష్టపోయిన రైతు కుర్వ కర్రెప్పను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరామారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం ప్రజాకళామండలి నాయకులతో కలిసి బాధిత రైతును పరామర్శించారు. ఇప్పటికైనా రైతులు పండించిన పత్తి పంటను క్వింటాలుకు రూ.12 వేలు చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు అశోక్, శివ, శంకర్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్త అవసరం

కృష్ణా: రాబోయే మూడు రోజుల్లో అకాల వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వారు హెచ్చరించడంతో మండల రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు సూచనలు చేశారు.

పంచాంగం ఆవిష్కరణ



దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో అభినవ సిద్ధలింగ శివాచార్య మహాస్వామి నూతన పంచాంగాన్ని మంగళవారం ఆవిష్కరించారు. బ్రహ్మశ్రీ నందుల మఠం శశిభూషణ్ సిద్ధాంతి రచించిన పంచాంగం ప్రయోజన కరంగా ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో రాష్ట్ర జంగమ సమాజం అధ్యక్షులు విశ్వేశ్వరయ్య, ఎస్ఎం కోటీశ్వర్‌స్వామి, పాలమూరు జిల్లా అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ స్వామి, అర్చకులు శరణయ్యస్వామి, చెన్నబస్సయ్యస్వామి, శివకుమార్‌స్వామి, శ్రీకాంత్ స్వామి పాల్గొన్నారు.

గోదాంల మంజూరుపై హర్షం

నర్వ: వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న రెండు గోదాములు నర్వకు మంజూరు చేయించినట్లు పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. నాబార్డు సహకారంతో రూ. 1.52 కోట్ల విలువ చేసే గోదాములు మంజూరు చేయించుకున్నామన్నారు. గతంలో ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక ఇబ్బందులు పడేవాళ్లమని జిల్లా డీసీసీబీ చైర్మన్ నిజం పాషా, సీఈఓ లక్ష్మయ్యలకు అనేక సార్లు వినతి అందజేశామన్నారు. టెస్కాబ్ అధికారి నుంచి ఉత్తర్వులు అందుకున్నట్లు వివరించారు. మంజూరైన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా నర్వ సొసైటీకి వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు.

హనుమాన్ మాలధారణ

నారాయణపేట రూరల్ : హనుమాన్ మాలాధారణ ముక్తికి మార్గమని గురుస్వాములు శరణప్ప, సీతారాములు అన్నారు. పట్టణంలోని సాయివిజయ్‌కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో పలువురు యువత మంగళవారం ఆంజనేయస్వామి మాలాధారణ చేసిన సందర్భంగా మాట్లాడారు. అఖిల్, వసంత్, మధు, బాలరాజు, శివ, విజయ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా..

- పీఎంఎఫ్ఎంఈ అమలు
- మండలానికి 30 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- 35 శాతం సబ్సిడీ, బ్యాంకుల నుంచి రుణాలు



సెర్ఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మహిళలు

దామరగిద్ద: మహిళా సాధికారతే లక్ష్యంగా ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ (పీఎంఎఫ్ఎంఈ)ను అమలు చేస్తోంది. సెర్ఫ్ సంస్థ ద్వారా మహిళా సంఘాల సభ్యులుగా ఉండి గతంలో బ్యాంక్ రుణాలు పొంది తిరిగి సక్రమంగా చెల్లించిన వారిని ఈ పథకానికి అర్హులుగా ఎంపికచేస్తున్నారు. వారు స్వయం ఉపాధి పొందేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేస్తున్నారు. వీటికోసం దరఖాస్తు చేసుకున్నవారి సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నాయి. యూనిట్లు మంజూరైన వారు 10 శాతం లబ్ధిదారు వాటా కింద చెల్లించాలి. 35 శాతం సబ్సిడీ పోగా, మిగిలిన మొత్తం బ్యాంకు ద్వారా రుణంగా తీసుకుని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పొందవచ్చు.

మండలానికి 30 యూనిట్లు

మండలంలో 46 గ్రామ సంఘాలు, 1076 మహిళా సంఘాలు ఉన్నాయి. 11,631 మంది సభ్యులు ఉన్నారు. ఈ నేపథ్యంలో పేటజిల్లాకు 330 ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు కాగా దామరగిద్ద మండలానికి 30 యూనిట్లను కేటాయించారు. వీటి కోసం ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు ఏడు యూనిట్లు మంజూరు చేశారు. కాన్‌కుర్తి, ఆశన్‌పల్లి, వత్తుగుండ్ల, దామరగిద్ద గ్రామాలకు చెందిన వారు వీరిలో ఉన్నారు. మిగిలిన 23 యూనిట్ల కోసం దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పథకం ద్వారా ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు పొందడం వల్ల మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుదని అంటున్నారు.

ఉపాధికి అవకాశం



ప్రభుత్వం ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం ద్వారా రుణాలు ఇస్తుందని తెలిసి దరఖాస్తు చేసుకున్నాను. మిర్చిపొడి మిషన్ కొనుగోలు చేయాలనుకుంటున్నాను. అధికారులు సబ్సిడీ రుణాలు అందిస్తే ఎంతో ప్రయోజన కరంగా ఉంటుంది.

–భాగ్యమ్మ, దరఖాస్తుదారు, బాపన్‌పల్లి

మండలానికి 30 యూనిట్లు

మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పీఎంఎఫ్ఎంఈ పథకం అమలు చేస్తోంది. తద్వారా 35 శాతం సబ్సిడీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేస్తున్నారు. మిగితా మొత్తంలో లబ్ధిదారు 10 శాతం చెల్లించాలి. మిగిలిన మొత్తం బ్యాంకు నుంచి రుణంగా పొందవచ్చు. మండలానికి 30 యూనిట్లు కేటాయించారు. వీటిలో 7 యూనిట్ల మంజూరు అయ్యాయి. ఉగాది నాటికి అర్హులందరికీ యూనిట్లు మంజూరు అవుతాయి.

–నర్సిములు, ఏపీఎం, దామరగిద్ద

సీసీ కెమెరాలకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు అలంకార ప్రాయంగా మారడంతో ఈ నెల 06న 'సాక్షి' దినపత్రికలో 'నిఘానేత్రాలపై నిర్లక్ష్యం' అనే వార్త ప్రచురితమైంది. దీంతో మాగనూర్ ఎస్ఐ నరేందర్ మంగళవారం స్పందించారు. సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించారు. దీంతో నేరాలు నియంత్రణలోకి వస్తాయని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బస్టాండ్ చౌరస్తాలో సీసీ కెమెరాలకు మరమ్మతు చేయిస్తున్న సిబ్బంది

అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



మిషన్ భగీరథ అధికారితో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

ధన్వాడ: మండలంలో సర్వేకోసం రైతులు దరఖాస్తు పెట్టుకుంటే ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని అడిగితే ఇబ్బందులకు గురిచేస్తున్నారని చర్లపల్లి సర్పంచ్ రాములు, ధన్వాడ ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. ఎంపీపీ పద్మినిబాయి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడారు. వరి కొనుగోలు మహిళా సంఘం వారికి ఇస్తే సంబంధం లేని వారు పెత్తనం చెలాయిస్తున్నారని అన్నారు. అధికారి సుల్తానాను ప్రశ్నించగా ఇకపై ఇలా జరగకుండా చూస్తానని వివరణ ఇచ్చారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారులను ప్రశ్నించగా ఏఈ ఉదయ్ సమాచారం లేకుండా ఉద్యోగానికి రావడం లేదని, ఇన్‌చార్జ్‌ను ధన్వాడకు కేటాయించినట్లు ఈఈ తెలియజేశారు. కాగా మండలంలో ఇన్‌చార్జ్ అధికారుల పాలన నడుస్తోందని దాదాపు సగం శాఖలలో ఇన్‌చార్జ్‌లే ఉన్నారని ఎంపీటీసీలు ఉమేష్‌కుమార్, గోవర్ధన్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే రావడం లేదని ఆరోపించారు. జెడ్పీటీసీ విమల, వైస్ఎంపీపీ రాజేందర్ రెడ్డి, ఎంపీడీఓ సద్గుణ, వివిధ శాఖల అధికారులు, అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు

పల్లెపల్లెకు పాదయాత్ర చేపడతాం



కొత్తపల్లిలో పర్యటిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

ఊట్కూర్: పల్లె పల్లెకు పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను తెలుసుకుంటామని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లిలో పల్లె పల్లెకు పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో తిరిగి రోడ్లు, మురుగుకాల్వలను పరిశీలించారు. సమస్యలపై ప్రజలతో మాట్లాడారు. పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్, బలరాం, గోవర్ధన్, రమేశ్, నర్సింహా, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

మాగనూర్: మండల కేంద్రంలోని నల్లగట్టు దగ్గర వెలసిన మారెమ్మవ్వ ఆలయ పునర్ నిర్మాణం కోసం కృష్ణా మండలం చెక్‌పోస్ట్ ప్రాంతానికి చెందిన లక్ష్మీపతి రూ. 11,000 విరాళంగా అందించారు. ఈ మేరకు నగదును మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మూడు రాష్ట్రాల ప్రజల పూజలు అందుకొంటున్న మరెమ్మవ్వ ఎంతో మహిమ కలిగిన దేవత అని అన్నారు. ఆలయ పునర్ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి

ఊట్కూరు: మహిళలు అన్ని రంగాలలో రాణించి ఉన్నతంగా ఎదగాలని సర్పంచ్ సుమంగళ కోరారు. మంగళవారం తిప్రాస్‌పల్లిలో మహిళా సంఘాల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు పావలా వడ్డీకే రుణాలు అందిస్తోందని అన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీసీ రాము, వీవోకే సంతోష, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ సుమంగళ

నేటినుంచి ఉత్సవాలు

కోస్గి: పట్టణంలోని తెలుగు వీధి, బీసీ కాలనీల్లో శ్రీ నాభి శిలా(బొడ్రాయి) విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 15న బుధవారం గణపతి గౌరీ పూజ, గోపూజ, అఖండ దీపారాధన, స్వస్తి పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం ప్రవేశం, రుత్వీగ్వరణము, విగ్రహాభిషేకం, జలాధివాసం, మంగళహారతి కార్యక్రమం ఉంటుందన్నారు. 16న గురువారం సర్వతోభద్ర మంటపారాధన, లక్ష్మీ గణపతి హవనం, దేవి హోమం, విగ్రహాభిషేకం, ధాన్యాధివాసం, మంగళహారతి, 17న శుక్రవారం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ అనంతరం విగ్రహ సందర్శన, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, వేదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమ అనంతరం సాయంత్రం బోనాలు సమర్పణ ఉంటుందన్నారు. ఈ ప్రతిష్ఠ వైదిక తపోనిధి రుద్రాక్షల మఠం అమర లింగ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న గ్రామస్తులు

మరికల్: రాకొండలో మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సీడీపీ నిధుల కింద రూ. 12 లక్షలు మంజూరు చేశారని ఉపసర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు మల్లేష్‌లు తెలిపారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో గత కొన్ని రోజులుగా పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణానికి నిధుల మంజూరుతో పాటు, 10 మందికి దళితబంధు మంజూరు చేయడంపై మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నరహరి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం మంజూరు

మరికల్: పెద్ద చింతకుంటకు గ్రామీణ గ్రంథాలయం మంజూరు అయినట్లు ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం గ్రంథాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే సీడీపీ నిధుల కింద రూ. 15 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, విండో చైర్మన్ రాజేందర్‌గౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, మల్లేష్, తిరుపతయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

మక్తల్: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సీఐ సీతయ్య అన్నారు. మంగళవారం మక్తల్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్, తదితర పత్రాలు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తీసుకెళ్లరాదని సూచించారు. ఎస్ఐ పర్వతాలు, పోలీస్‌సిబ్బంది మనోహర్‌రెడ్డి, గిరి, నరేష్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సీతయ్య

చెరువులో చెట్లు తొలగించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మరికల్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను, చెట్లను తొలగింపజేయాలని మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ రాంకోటి, ఎంపీడీఓ యశోదలకు వినతి పత్రాలు అందజేశారు. అదేవిధంగా గ్రామంలోని డ్రెయినేజీ నీరు చెరువులోకి రావడంతో కాలుష్యం ఏర్పడి చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, చంద్ర శేఖర్, బాల్‌రాజ్, రామకృష్ణ, శేఖర్, మొగులప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'పేపర్ లీకేజీ' బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కోస్గి: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడి టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ కోటకొండ రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సైతం అరెస్టు చేసి విచారించాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తే పోలీసులు లాఠీచార్జ్ చేసి తీవ్రంగా కొట్టడం హేయమైన చర్య అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సీబీ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

దామరగిద్ద: అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం మని ఎంపీపీ నర్సప్ప, ఐసీడీఎస్ దామరగిద్ద క్లస్టర్ సూపర్‌వైజర్ రూప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ చిన్నారుతో బాలమేళా నిర్వహించారు. ఎంపీపీ నర్సప్ప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలపై కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం, క్రీడలు, ఆట పాటలు ఎంతో ప్రభావం చూపిస్తాయన్నారు. సందర్భంగా బాలమేళాలో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రథమ్ సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్‌లు వసంతబాయ్, ఈశ్వరమ్మ, అంజిలమ్మ, లలిత, శాదర, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాలమేళాలో పాల్గొన్న ఎంపీపీ నర్సప్ప

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మద్దూరు: ఇంటర్ పరీక్షల బుధవారం నుంచి జరగనున్న నేపథ్యంలో మద్దూరు జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు. ఈ సెంటర్‌లో కేజీబీవీ పెదిరిపాడ్, బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారని తెలిపారు. విద్యార్థులు సరైన సమయానికి పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు.

మాగనూర్: ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. కృష్ణ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థులతో పాటుగా మాగనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు సీఎస్ రేణుకదేవి తెలిపారు.

ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు పెంపు

మరికల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈ నెల 16 వరకు పొడిగించినట్లు వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

ఊట్కూర్: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన నలుగురు బాలికలు ఎంపికయ్యారు. వీరిలో ఊట్కూర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన భార్గవి, నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన వైష్ణవి, నిర్మల, నవనీతలు ఉన్నారని హెచ్ఎంలు స్పందన, లక్ష్మారెడ్డి మంగళవారం తెలిపారు. వీరికి నాలుగేళ్ల పాటు ఏటా రూ.12వేలు ఉపకార వేతనం అందుతుందన్నారు. ఈ నగదు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, వెంకటప్ప, సుజాత, సలాం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రక్తదాన శిబిరం ఏర్పాటు

ఊట్కూర్: ఆపదలోఉన్న వారిని ఆదుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్కోటి జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఊట్కూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌వీఎస్ వైద్య కళాశాల, ఆస్పత్రి వైద్య బృందంతో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశామని తెలిపారు. అదేవిదంగా 40 మంది యువకులు రక్తదానం చేశారని తెలిపారు. సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి, క్లబ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ హరినారాయణ్ బట్టడ్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రకారం సీట్లు కేటాయించాలి

నారాయణపేట టౌన్ : రాజకీయ పార్టీలు బీసీ డిక్లరేషన్ ప్రకటించి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని బీసీసేన జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు అధిక స్థానాలు కేటాయించిన పార్టీకి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. బీసీలను చిన్నచూపు చూసే పార్టీలకు రాబోయే రోజుల్లో రాజకీయ సన్యాసం తప్పదని ఈ సందర్భంగ హెచ్చరించారు. బాల్‌రాజ్, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కాచ్‌వార్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులు



మందిపల్లిలో..

జిల్లాలోని ఆయా మండలాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాలల ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. –సాక్షి నెట్‌వర్క్



ఊట్కూరులో..



పోతిరెడ్డిపల్లిలో..

కొనసాగుతున్న 'కంటివెలుగు'



మక్తల్: పట్టణంలో మంగళవారం 16వ వార్డులో కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా 80 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలను కౌన్సిలర్ కౌసల్య చేతుల మీదుగా అందజేశారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు నాగమణి, డాక్టర్ శంకరప్ప, డీఈఏ హర్షవర్ధన్‌గౌడ్, సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కృష్ణా: మండల కేంద్రంలో మంగళవారం సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ రాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషితో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. నాయకులు బర్మణోళ్ల సురేష్, శంఖర్‌నాయక్, మహదేవ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా వినయ్‌మిత్ర

నారాయణపేట టౌన్ : పేట నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్‌గా సీనియర్ నాయకుడు వినయ్‌మిత్ర యాదవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియమించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ అబ్జర్వర్ మెట్టు కాడి శ్రీనివాసులు నియామక పత్రాన్ని వినయమిత్ర యాదవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన వారికి వినయ్ మిత్ర ధన్యవాదాలు తెలియజేశారు.